## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన కలెక్టరేట్

కామారెడ్డి/నాగిరెడ్డిపేట/బీబీపేట్, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కామారెడ్డి జిల్లా కేంద్రం ముస్తాబైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆవిర్భావ వేడుకలకు అధికారులు అన్ని సిద్ధం చేశారు. ఈ వేడుకలకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 9.10 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం ఇస్తారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు పలు ప్రభుత్వ సంస్థలు ముస్తాబయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలోని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఆయా గ్రామాల్లో ఉదయం 9.30 గంటలలోపు జెండా ఆవిష్కరణ చేపట్టాలని సూచించారు. బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో సోమవారం నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు జెండా ఆవిష్కరణ కోసం ముస్తాబు చేసినట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే జెండా ఆవిష్కరణలకు అధికారులు, నాయకులు, యువకులు, గ్రామస్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మాడల్‌స్కూల్ కిచెన్, డైనింగ్ హాల్‌కు రూ.10 లక్షలు మంజూరు

నాగిరెడ్డిపేట, జూన్ 1 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ ఏర్పాటు కోసం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. పాఠశాలలో గత పన్నెండు ఏండ్లుగా.. విద్యార్థులకు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ లేకపోవడంతో పాఠశాల వరండా, చెట్లకింద భోజనాలు చేస్తున్నారు. విద్యార్థుల ఇబ్బందులపై ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పలుమార్లు కలెక్టర్, డీఈవో, డీఆర్డీఏ జిల్లా అధికారులకు విన్నవించుకున్నారు. వారి సహకారంతో కలెక్టర్ పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇబ్బందులను గుర్తించి నిధులు మంజూరు చేసిన కలెక్టర్‌కు విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు పూర్తి

నాగిరెడ్డిపేట, జూన్ 1 : మండలంలో సొసైటీలు, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి మూసి వేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెద, కిచ్చన్నపేట సొసైటీ, ఐకేపీ సమాఖ్య ద్వారా 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 4,860 మంది రైతుల నుంచి 2లక్షల63వేల 943 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు తమ ఖాతాల్లో నగదు జమా చేస్తున్నట్లు చెప్పారు.



తాండూర్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు



కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

# పలు మండలాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

నాగిరెడ్డిపేట/బాన్సువాడ/మద్నూర్, జూన్ 1 : నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1991-92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 34 ఏండ్ల తర్వాత ఒక్క చోట చేరి గత స్మృతులను నెమరేసుకున్నారు. విద్య బుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. సాయంత్రం వరకు ఉపాధ్యాయులతో కాలక్షేపం చేశారు. 34 ఏండ్ల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు గంగారెడ్డి, శ్రీనివాస్, సత్యంగౌడ్‌లు తెలిపారు. బాన్సువాడ పట్టణంలోని కోనాబాన్సువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004- 05 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు కాశీనాథ్, రామకృష్ణారెడ్డి, నాగభూషణం, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, గంగారెడ్డి, సామ్రాజ్యం, సంతోషితోపాటు పూర్వ విద్యార్థులు రేపాని భాస్కర్, మచి అనిల్, అంజాగౌడ్, అన్నం ప్రవీణ్, కాటేపల్లి శివ, ఎండీ రఫీ ఉన్నారు. మద్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు గంగారాం, లక్ష్మయ్య, మనోహర్, కాషాగౌడ్, సునీల్, నరేందర్, రమేశ్, భారత్‌భూషన్‌ను సన్మానించి పాదాభివందనం చేశారు. కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుకున్న 1983-84 బ్యాక్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ది స్నేహ ఏ ట్రూ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర ప్రసాద్, కోశాధికారిగా మహాదేవ్, ఉపాధ్యక్షులుగా రాములు, డాక్టర్ బాలరాజు, సంయుక్త కార్యదర్శులుగా కూకట్ల నగేశ్, రాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గజవాడ శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా వంశీ ప్రతాప్ గౌడ్, సలహాదారులుగా దామోదర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమేశ్, లక్ష్మీనారాయణ, విద్యాధర్‌రెడ్డి, నయీం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



మద్నూర్‌లో గురువులతో పూర్వ విద్యార్థులు



కోనబాన్సువాడలో తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## కిటకిటలాడుతున్న రేషన్ దుకాణాలు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1 : ఎల్లారెడ్డి పట్టణంలోని రేషన్‌దుకాణాలతోపాటు మండలంలో ని అన్ని రేషన్ దుకాణాలు లబ్ధిదారులతో కిటకిటలాడాయి. రాష్ట్ర ప్రభుత్వం రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మూడు నెలలకు సంబంధించిన (జూన్, జూలై, ఆగస్ట్) రేషన్‌ను డీలర్లకు ఎంఎల్ ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేయడంతో జూన్ మొదటి తేదీ నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాల బాట పట్టారు. దీంతో డీలర్లు లబ్ధిదారులతో సంయమనం పాటించాలని అందరికీ రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం ఒకేసారి తూకం వేయడానికి సాఫ్ట్‌వేర్ సహకరించకపోవడంతో మూడు, నాలుగు సార్లు లబ్ధిదారుల వేలిముద్ర తీసుకోవాల్సి వస్తున్నదని, దీంతో ఒక్కొక్క లబ్ధిదారుడికి చాలా సమయం పడుతుందని డీలర్లు తెలిపారు. లబ్ధిదారులు సహకరించి వరుస క్రమంలో రేషన్ తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి పట్టణంలో లబ్ధిదారులతో సందడిగా మారిన రేషన్ దుకాణం

## పాతరాజంపేటలో బోనాల పండుగ



బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జూన్ 1 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో పోచమ్మ బోనాల పండుగ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బోనాల పండుగలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ ఎంఎల్ మాస్ నాయకులు

కామారెడ్డి, జూన్ 1 : జిల్లా కేంద్రంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యాలయంలో టీయూసీఐ సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మొదటి జిల్లా మహాసభల పోస్టర్లను నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక విధానాలపై పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తన్న, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర నాయకులు దేవారం, రమేశ్, ప్రకాశ్, అనిత, రాజేశ్వర్, సురేశ్, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 'అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం'

నస్రుల్లాబాద్, జూన్ 1 : మండలంలోని సంగం గ్రామంలో ఆదివారం మేరా భారత్, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన అంతర్జాతీయ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సండే ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. నేటితరం యువత మోటర్ సైకిల్, కార్ల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా సైకిల్ వినియోగాన్ని ఎంచుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమై ఫిట్ ఇండియాను తయారు చేయడానికి తమ వంతుగా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

## విజయవంతంగా తెరవే జిల్లా మహాసభ



తెరవే మహాసభలో మాట్లాడుతున్న ప్రముఖ కవి రచయిత పరిశోధకులు తిరుమలరావు

కామారెడ్డి, మే 25 : జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో తెలంగాణ రచయితల వేదిక మహాసభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి రచయిత పరిశోధకులు తిరుమలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెరవే ఉద్యమ కాలం నుంచి ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్నదని అన్నారు. మారుతున్న సామాజిక పరిస్థితులను ఎప్పటికప్పుడూ అంచనా వేస్తూ ప్రణాళికలను రూపొందించుకుంటూ కార్యక్రమాల రూపకల్పన చేస్తూ ఆచరణలో ఉంచాలని సూచించారు. తెరవే నిబద్ధతతో పని చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క, తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి, తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, నాగభూషణం, వెంకటేశ్వర్లు, నారాయణ, లచ్చయ్య, లక్ష్మణ్, ప్రేమ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా ఎంపిక చేయాలి

నాగిరెడ్డిపేట, జూన్ 1 : రాజీవ్ యువ వికాస పథకంలో ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానంతో గ్రామ యూనిట్‌గా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుంటోళ్ల యాదయ్య మాదిగ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నాగిరెడ్డిపేట మండలంలో మాదిగ కులస్తుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. అధికారులు గ్రామ యూనిట్‌గా తీసుకొని ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానంతో.. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా జనాభా దామాషా ప్రకారం యూనిట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు యూనిట్ల మంజూరులో అన్యాయం జరిగితే.. ఉద్యమం చేయడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

# గ్రామాల్లో ఊర పండుగ



బాణాపూర్‌లో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు



లక్ష్మాపూర్ గ్రామంలో

లింగంపేట, జూన్ 1 : లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ఊర పండుగలు నిర్వహించారు. మండలంలోని లింగంపల్లి, సురాయిపల్లి, ఒంటర్‌పల్లి, ముస్తాపూర్, బాణాపూర్ తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను అందంగా అలంకరించి గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. బోనాలను గ్రామ దేవతలకు సమర్పించారు. అనంతరం పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు చల్లంగా ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

**లక్ష్మాపూర్‌లో..**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 1 : మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు. అలయాన్ని అందంగా అలంకరించి అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం శివసత్తుల నృత్యాలతో భారీ ఊరేగింపు కొనసాగింది. సోమవారం గ్రామంలో కుస్తీపోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రామకమిటీ సభ్యులు తెలిపారు.

## విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న కాపు సంఘం నాయకులు

లింగంపేట, జూన్ 1 : ఇంటర్, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన మున్నూరుకాపు సంఘం విద్యార్థులకు కాపు సంఘం నాయకులు సన్మానం చేశారు. లింగంపేట మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో సాయిబాబా మాట్లాడుతూ.. చదువుకు ఆర్థిక పరిస్థితి అడ్డుకాదన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం మండల అధ్యక్షుడు గుండ బాలకిషన్, గౌరవ అధ్యక్షుడు పోశెట్టి, సబ్బిడి అంజయ్య, గంగరాజు, చందు, లక్ష్మీరాయణ, అనురాగ్, ఉదయ్, కాశీరాం, ఆయా గ్రామాలకు చెందిన కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వానకాలం పంటల సాగులో రైతన్నలు..



బోర్లం క్యాంపు తండా శివారులో నారుమడిలో వరి విత్తనాలు అలుకుతున్న రైతులు

బాన్సువాడ రూరల్, జూన్ 1 : ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు వానకాలం పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద రైతులు వరి పంటను సాగు చేసేందుకు నారుమడులను సిద్ధం చేసుకొని వడ్లు అలుకుతున్నారు. కురిసిన భారీ వర్షాలతో రైతులు ముందస్తుగానే దుక్కులు దున్ని పంట సాగుకు సిద్ధం అయ్యారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధి గ్రామాలైన బోర్లం, బోర్లం క్యాంపు, జక్కల్‌దాని తండ, ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్ తిర్మలాపూర్, తదితర గ్రామాల్లో రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు కురిస్తే జూన్ చివరి వారంలో నాట్లు వేస్తామని రైతులు తెలిపారు.

## పోలీసులకు ఉత్తమ సేవా పురస్కారాలు

కామారెడ్డి, జూన్ 1 : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన అధికారులకు ప్రతిష్టాత్మకంగా అందించే ఉత్తమ సేవా పతకాలకు జిల్లాలోని 17 మంది పోలీసు అధికారులు ఎంపికయ్యారని ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉత్తమ సేవా పతకానికి కామారెడ్డి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ లింగయ్య ఎంపికయ్యాడని తెలిపారు. రాష్ట్రస్థాయి పురస్కారాల కోసం ఎంపికైన పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు తెలిపారు.

## కురుమ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కురుమ యువజన సంఘం సభ్యులు

కామారెడ్డి, జూన్ 1 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి కురుమ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగల్ల స్వామి, కోశాధికారిగా దొడ్లె సంజీవ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా చెట్కూరి గంగరాజ్యం, మార్కంటి స్వామి, నాగల్ల రాజయ్య, ఒగ్గు నర్సింహులు, దొడ్లె రమేశ్, చిందం మల్లేశ్, మచ్చ గంగాధర్, గండాల రవి, భాస్కర్, నరేశ్, మహిపాల్, స్వామి, మల్లేశ్, నాగల్ల రాజేందర్, ప్రభాకర్, నడిపి సాయిలు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాచారెడ్డి తహసీల్దార్ బదిలీ

మాచారెడ్డి, జూన్ 1 : మాచారెడ్డి తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్వేత తాడ్వాయికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కలెక్టరేట్‌లో సూపరింటెంటెంట్‌గా పనిచేస్తున్న సరళ బదిలీపై మాచారెడ్డికి రానున్నారు. తహసీల్దార్ శ్వేత మాచారెడ్డిలో దాదాపు రెండు సంవత్సరాలు పని చేశారు.

## కామారెడ్డి సీపీవోకు ఉద్యోగోన్నతి

కామారెడ్డి, జూన్ 1 : కామారెడ్డి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో) రాజారాం ఉద్యోగోన్నతి పొందారు. ఆయన కరీంనగర్ జాయింట్ డైరెక్టర్‌గా వెళ్తున్నారు. రాజారాం 2021 మార్చిలో కామారెడ్డి జిల్లా సీపీవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న సుజాత ఉద్యోగోన్నతిపై రానున్నట్లు సమాచారం.

## నీటి వృథాను అరికట్టండి..



సంగోజీపేట్ పేట్‌లో వృథాగా పోతున్న బోరు నీరు

బాన్సువాడ రూరల్, జూన్ 1 : గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రోజంతా నీరు వృథాగా పోతోంది. బాన్సువాడ మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పాత గ్రామ పంచాయతీ భవనం సమీంలో సింగిల్ ఫేజ్ బోరు మోటర్ల వద్ద నీరు వృథా పోతోంది. నిత్యం నీరు పారడంతో డ్రైజీలు నిండి వాటి నుంచి దుర్వాసన వస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు మోటర్లు, నీటి కులాయిలకు ఆన్‌ఆఫ్ బిగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## రహదారిపై చిగురించిన చెట్లు



పచ్చదనం సంతరించుకున్న కామారెడ్డి, ఎల్లారెడ్డి రహదారి

లింగంపేట, జూన్ 1 : కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై చెట్లు చిగురించాయి. ఎండలు తీవ్రంగా మండి పోవడంతో రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు ఆకులు ఎండిపోయి మోడుగా మారాయి. చెట్లు పూర్తిగా ఎండిపోవడంతో నిలువనీడ లేకుండా పోయింది. ప్రతి సంవత్సరం రోహిణి కార్తెలో ఎండలు తీవ్రంగా ఉంటాయి. ప్రస్తుతం రోహిణి కార్తెలో తీవ్రంగా ఉండాల్సి ఎండలకు బదులుగా వర్షాలు కురిశాయి. తుపాను కారణంగా కురిసిన అకాల వర్షాలకు ఎండిపోయిన చెట్లు చిగురించాయి. దీంతో లింగంపేట, ఎల్లారెడ్డి రహదారికి ఇరువైపులా పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పచ్చని చెట్ల మధ్య ప్రయాణంతో వాహనదారులు ఆనందోత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

## బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

రామారెడ్డి(సదాశివనగర్), జూన్ 1 : జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామానికి చెందిన కరడ్లపల్లి కార్తిక్‌రావు ఆదివారం కుప్రియాల్ లో పోచమ్మ పండుగకు డీజే వాహనం పెట్టి అక్కడి నుంచి భూంపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అడ్లూర్ యెల్లారెడ్డి శివారులో ఉన్న గాయత్రి ఫ్యాక్టరీ దగ్గర జాతీయ రహదారి పక్కన ఉన్న సైడ్ రేలింగ్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు..

నాగిరెడ్డిపేట, జూన్ 1 : మండలంలోని మేజర్‌వాడి గ్రామ శివారులోని మంజీరానది సమీపంలో మేత మేస్తున్న ఆవుకు ఎస్ఎస్39 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ని కోడెలస్మయ్యకు చెందిన గేదెలతో ఆవును నిత్యం మంజీరానది శివారులో మేతకు తీసుకువెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో.. ఆవు గడ్డిని మేస్తు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ఆవు ధర రూ.50 వేలు ఉంటుందని బాధితుడు లస్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు. విద్యుత్ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు.

## వీడీసీ కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, జూన్ 1 : లింగంపేట మండలం కోమట్‌పల్లి గ్రామం లో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక సమావేశం నిర్వహించిన వీడీసీ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా నెల్లూరి గంగారాం, ఉపాధ్యక్షుడిగా చాకలి అశోక్, ప్రధాన కార్యదర్శిగా వెల్పుల నర్సింహులు, సహాయ కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా నాయిని బాల్‌రాజ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, GANGANI KUMAR S/o. GANGANI BALRAJU R/o. H.No. 2-74, Village: BHAVANIPET Mdl-PALWANCHA DIST: KAMAREDDY-503111, TS. Changed My Name As GANGANI RAJU KUMAR S/o. GANGANI BALRAJU

NT-347155

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.